
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం | 29 | మార్చి | 2024



రూ.1,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి వక్కలంక వేంకటేశ్వరరావు, సూర్య కుమారి దంపతులు (ఏలేశ్వరం) రూ.1,00,116 విరాళం గురువారం సమర్పించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని వదిలారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర (సా॥)	సెహరీ శని (ఉ॥)
రాజమహేంద్రవరం	6.24	4.38
కాకినాడ	6.24	4.38
అమలాపురం	6.24	4.38

న్యూస్‌రీల్

బి ఫామ్ సరే... ఎ ఫామ్ గురించి తెలుసా?

అంబాజీపేట: గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ తరఫున అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసే సమయంలో బి ఫామ్ సమర్పించాలి. సదరు పత్రంలో అభ్యర్థి పేరు. పార్టీ గుర్తు, నియోజక వర్గ వివరాలతో ఆ పార్టీ అధ్యక్షుడి సంతకం ఉంటుంది. నామినేషన్‌తో పాటు అభ్యర్థి బి ఫామ్‌ను జతచేస్తే ఎన్నికల రిటర్నింగ్ అధికారి గుర్తు కేటాయిస్తారు. అలాగే 'ఎ' ఫామ్‌ను సంబంధిత పార్టీ వారు ఎన్నికల కమిషన్‌కు అందజేయాల్సి ఉంటుంది. ఇందులో పార్టీ పేరు. పార్టీ తరఫున పోటీచేస్తున్న అభ్యర్థులందరి పేర్లు, ఎవ్వరు ఎక్కడ నుంచి పోటీ చేస్తున్నారనే పూర్తి వివరాలు ఉంటాయి. సంతకాలను ఫోర్జరీ చేయకుండా ఎ ఫామ్‌లో మూడుచోట్ల పార్టీ అధ్యక్షుడి సంతకం ఉంటుంది. పోటీ చేసే అభ్యర్థి బి ఫామ్‌ను నియోజకవర్గంలోని రిటర్నింగ్ అధికారికి సమర్పించాక, ఎ ఫామ్‌ను ఎన్నికల కమిషన్‌కు అందజేస్తారు. ఈ రెండింటినీ పోల్చిచూసి, నిశితంగా పరిశీలించి అభ్యర్థి సదరు పార్టీ తరఫున పోటీ చేస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గురువారం నిర్వహించిన పదో తరగతి సంస్కృతం పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. 42 పరీక్షా కేంద్రాలలో జరిగిన సంస్కృతం పరీక్షకు 2,109 మందికి గాను 2,096 మంది విద్యార్థులు హాజరయ్యారు. 13 మంది పరీక్షలకు హాజరు కాలేదు. డీఈఓ ఎం.కమలకుమారి, అసిస్టెంట్ కమిషనర్ ఎం.సురేష్‌తో పాటు తొమ్మిది ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పరీక్షా కేంద్రాలను పరిశీలించాయి.

విఘ్నేశ్వరుని ఆదాయం రూ.15,73,509

అయినవిల్లి: విఘ్నేశ్వరుని హుండీ ఆదాయాన్ని ఆలయ తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు, దేవదాయశాఖ జిల్లా అధికారి డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం లెక్కించారు. 35 రోజులకు గాను స్వామివారికి రూ.15,73,509 హుండీల ద్వారా ఆదాయం లభించిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఇంకా 31 గ్రాముల బంగారం, 240 గ్రాముల వెండి లభించినట్లు తెలిపారు. ఆరు విదేశీ నోట్లు లభించాయన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఆలయ కమిటీ పాలక వర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రత్నగిరిపై భక్తుల కిటకిట

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయానికి గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున రత్నగిరిపై, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవ దంపతులు వారి బంధుమిత్రులతో కలిసి అధిక సంఖ్యలో సత్యదేవుని వ్రతాలాచరించి, స్వామివారిని దర్శించారు. వీరితో పాటు సాధారణ భక్తులు కూడా రావడంతో ఆలయంలో తీవ్ర రద్దీ ఏర్పడింది. గురువారం కావడంతో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరులను నిజరూపంలో దర్శించుకుని భక్తులు పులకించారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని, దర్శించి పూజలు చేశారు. రెండు వేల వ్రతాలు జరిగాయి. ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రదక్షిణ దర్శనానికి గంట సమయం పట్టింది.

లక్ష్యాలకు దూరంగా.. పన్నుచాయతీలు

- శత శాతం వసూలు సాధ్యమేనా?
- రూ.40.13 కోట్ల పన్ను వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ
- ఇప్పటి వరకు రూ.31,00,90,113 వసూలు



ఇంటి పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది



రాయవరం: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు. గ్రామాల అభివృద్ధికి కావల్సిన నిధులు ప్రభుత్వం నుంచి విడుదలవుతుండగా, మరింత అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు పంచాయతీ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక వనరులను సమీకరించుకొంటారు. పన్ను వసూళ్లు, ప్రభుత్వం విడుదల చేసే గ్రాంట్లకు సంబంధించిన నిధుల పరిపుష్టితోనే గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి సాధ్యమవుతుంది. కేంద్రం ప్రభుత్వం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులకు తోడుగా..గ్రామ పంచాయతీల్లో పన్నులు, పన్నేతరములపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తే ఆయా గ్రామ పంచాయతీ ఖాతాల్లో నిధులు జమ అయ్యే అవకాశాలు ఉంటాయి. గ్రామాల్లో పంచాయతీ అధికారులు, సిబ్బంది ఇంటి పన్ను వసూళ్లను ముమ్మరం చేశారు. గ్రామ పంచాయతీల్లో వసూలు చేయాల్సిన పన్నులు, పన్నేతరములకు సంబంధించి మార్చి నెలాఖరుకు వసూలు చేయాల్సి ఉంది. మూడు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు శత శాతం పన్నుల వసూళ్లు చేపట్టాల్సి ఉంది.

పన్నులతోనే ప్రగతి పరుగులు

ఇంటి పన్నులు, ఆస్తి పన్ను, కుళాయి బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, స్టాంపు డ్యూటీలతో పాటు ఇతర పన్నుల ద్వారా వచ్చిన ఆదాయంతోనే గ్రామాల్లో అభివృద్ధికి అడుగులు పడతాయి. ఐదు శాతం సాధారణ, 30 శాతం వేతనాలు, 15శాతం వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్యం పనులపై వెచ్చిస్తారు. గ్రామ పంచాయతీ పరిధిలో పన్ను వసూలు చేయడం, వాటిని అభివృద్ధి పనులకు వెచ్చించుకునే విషయంలో గ్రామ సర్పంచ్‌లది కీలకపాత్ర. ఆయా గ్రామ పంచాయతీల్లో పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని పూర్తిగా గ్రామాభివృద్ధి కోసం వెచ్చించుకునే సౌలభ్యం ఉంది. అయినా వివిధ గ్రామాల సర్పంచులు పన్ను వసూళ్లపై దృష్టి సారిస్తున్నా పూర్తి స్థాయి లక్ష్య సాధన కాలేదు. గ్రామ పంచాయతీల్లో పన్నులు (ఇంటి పన్ను, లైబ్రరీ సెస్సు, కుళాయి పన్ను), పన్నేతరముల (మార్కెట్ వేలాలు, షాపింగ్ అద్దెలు, లైసెన్స్ ఫీజులు, కుళాయి పన్నులు, భవన నిర్మాణ ఫీజులు) రూపంలో సొంత వనరులను సమీకరించుకోవడంలో సర్పంచులు తమ వంతు పాత్రను పోషించాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

జిల్లాలో 385 పంచాయతీల పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.40,13,77,748 వసూలు లక్ష్యం కాగా, అందులో గతేడాది పన్నులు రూ.6,04,25,417 కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.34,09,52,331. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ నెల 28వ తేదీ వరకు బకాయిలు రూ.3,18,43,161, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.27,82,46,952 వెరసి రూ.31,00,90,113 వసూలు చేశారు. మొత్తం పన్ను డిమాండ్‌లో 77.26 శాతం వసూలు చేయగా, మిగిలిన మూడు రోజుల్లో రూ.9,12,87,635 (22.74 శాతం) వసూలు చేయాల్సి ఉంది. అమలాపురం డివిజన్ పరిధిలో 234 పంచాయతీల్లో రూ.21,24,81,444 వసూలు లక్ష్యంగా కాగా, రూ.16,81,22,650 వసూలు చేశారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలో 151 పంచాయతీల్లో రూ.18,88,96,304 పన్నుల వసూళ్లు లక్ష్యంగా ఉండగా, రూ.14,19,67,463 వసూలు చేశారు.

పూర్తి వసూలుకు కృషి



పంచాయతీల్లో శత శాతం పన్ను వసూళ్లకు కృషి చేస్తున్నాం. డివిజన్ల వారీగా లక్ష్యాల మేరకు వసూలు చేయాల్సిన పన్నులపై కార్యదర్శులతో నిరంతరం సమీక్ష చేస్తున్నాం. పంచాయతీ కార్యదర్శులకు పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని ఆదేశాలిచ్చాం. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా నూరు శాతం వసూలుకు ప్రయత్నిస్తున్నాం.

– డి.రాంబాబు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, అమలాపురం

1న సత్యదేవుని ఆలయ వార్షికోత్సవం



సత్యదేవుని ఆలయం

అన్నవరం: సత్యదేవుని ఆలయ పునర్నిర్మాణం జరిగి వచ్చే నెల ఒకటో తేదీకి పుష్కర కాలం.. అంటే 12 సంవత్సరాలు పూర్తవుతున్నాయి. ఆలయం 13వ వసంతంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. 1891 సంవత్సరంలో (ఖర నామ సంవత్సరం) శ్రావణ శుద్ధ విదియ నాడు రత్నగిరిపై సత్యదేవుడు ఆవిర్భవించినట్టు ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. స్వామివారు ఆవిర్భవించి 133 సంవత్సరాలు పూర్తయ్యింది. స్వామివారి పురాతన ఆలయం శిథిలావస్థకు చేరడంతో 2011లో అప్పటి కార్యనిర్వహణాధికారి కె.రామచంద్ర మోహన్ హయాంలో సత్యదేవుడు, అమ్మవారు, ఈశ్వరుల మూలవిరాట్టులను కదపకుండా.. ఆ మూర్తులకు పకడ్బందీ రక్షణ ఏర్పాట్లు చేసి, పాత ఆలయాన్ని తొలగించి, నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆ ఆలయాన్ని ఫాల్గుణ బహుళ సప్తమి (మార్చి 14, 2012) నాడు అప్పటి కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు జయేంద్ర సరస్వతి స్వామి చేతుల మీదుగా కలశ స్థాపన చేసి ప్రారంభించారు. అప్పటి నుంచీ తెలుగు తిథుల ప్రకారం ఫాల్గుణ బహుళ సప్తమి నాడు నూతన ఆలయ కలశ ప్రతిష్ఠ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. అదే సందర్భంగా వచ్చే నెల ఒకటో తేదీన ఈ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ప్రస్తుతం కూడా ఆలయ ఈఓగా రామచంద్ర మోహనే ఉండటం విశేషం. ఆ రోజు తెల్లవారుజామున సత్యదేవుడు, అమ్మవారికి, శంకరులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయాన్ని, ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిస్తారు. స్వామివారికి బూరెలు, పులిహోర, రవ్వకేసరి ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేస్తారు. అదే విధంగా స్వామివారి గోధుమ నూక ప్రసాదం కూడా పంపిణీ చేస్తారు.

పీవోలపై కీలక బాధ్యత

కలెక్టర్ శుక్లా

సాక్షి అమలాపురం: పోలింగ్ రోజున ప్రిసైడింగ్ అధికారి ముఖ్య భూమిక పోషించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల మూడో రోజు శిక్షణ కార్యక్రమం గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆడిట్, జల వనరుల శాఖలకు చెందిన ఉద్యోగులతోపాటు అయినవిల్లి, అలమూరు మండలాలకు చెందిన గ్రామ, వార్డు సచివాలయ సహాయకులకు ఇక్కడ శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ పీవోలు, ఏపీవోలు తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమాలకు హాజరుకావాలని స్పష్టం చేశారు. పోలింగ్ ముందు రోజు ఉదయాన్నే మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకుని రిటర్నింగ్ అధికారులను కలవాలని, రాండమైజేషన్ ద్వారా మీకు కేటాయించిన పోలింగ్ స్టేషన్ ఉన్న గ్రామం, పోలింగ్ స్టేషన్ నంబర్ వివరాలు తెలుసుకోవాలన్నారు. పోలింగ్ మెటీరియల్‌తో పాటు బ్యాలెట్ యూనిట్ కంట్రోల్, యూనిట్ వి.వి.ప్యాక్‌లను తీసుకొని అన్ని రకాల ట్యాగులు స్క్రిప్ట్ సీల్స్, పేపర్ సీళ్లు, ప్రిసైడింగ్ అధికారి డిక్లరేషన్, అధికారి డైరీ, టెండర్ ఓట్ల పోలింగ్ కోసం బ్యాలెట్ పేపర్లు, ఓటర్ జాబితా మార్కుడు కాపీలు, ఫారం- 7ఏ, ఓటర్ స్లిప్పులు, ఇండేలిబుల్ లింకులను జాగ్రత్తగా స్వీకరించాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బంది సొంత వాహనాలలో పోలింగ్ కేంద్రాలకు వెళ్లే అవకాశం లేదన్నారు. రాత్రి తప్పనిసరిగా పోలింగ్ కేంద్రంలో నిద్రించాలని ఆయన స్పష్టం చేశారు. పోలింగ్‌కు 90 నిమిషాల ముందుగా మాక్ పోలింగ్, పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో నిర్వహించి డిక్లరేషన్ ఇస్తూ అంతా సక్రమంగా ఉన్నట్లు ధ్రువీకరించుకోవాలన్నారు. ఉదయం ఏడు గంటల ఉంచి పోలింగ్ ప్రారంభించాలని కలెక్టర్ శుక్లా సూచించారు. నోడల్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్‌ప్రసాద్, మాస్టర్ ట్రైనీలు శిక్షణ ఇచ్చారు.



ఈవీఎంల పనితీరుపై పీవో, ఏపీవోలకు ఇస్తున్న శిక్షణ తీరు పరిశీలిస్తున్న కలెక్టర్ శుక్లా

సంక్షేమం వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

- ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి పార్టీని గెలిపించాలి
- వైఎస్సార్ సీపీ అభ్యర్థి విశ్వరూప్

అల్లవరం: సంక్షేమ పథకాలు పారదర్శకంగా గడప గడపకు చేరాలంటే రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారం సాధించాలని ఆ పార్టీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పినిపే విశ్వరూప్ అన్నారు. అల్లవరం మండలం తాడికోన గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌లో కలసి నిర్వహించారు. తొలుత తాడికోనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి విశ్వరూప్ పూలమాల వేసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ సారథ్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో విశ్వరూప్ ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన అసెంబ్లీ అభ్యర్థి విశ్వరూప్‌కు మహిళలు హారతులు ఇచ్చి నీరాజనాలు పలికారు. బడుగు, బలహీన వర్గాల వారికి అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి క్రమం తప్పకుండా చేరాలంటే వైఎస్సార్ సీపీ మరోమారు అధికారం దక్కించుకోవాలని విశ్వరూప్ అన్నారు. గడిచిన ఐదేళ్లల్లో అనేక రకాల సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చామన్నారు. తొలిరోజున తాడికోన, గూడాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, సర్పంచ్‌లు సాధనాల సూర్య వెంకటనాగమణి, దాకారపు చిరంజీవి రావు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఎల్లమిల్లి బోస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పరమట శ్రీను, గ్రామకమిటీ అధ్యక్షుడు శిరంగు వీరబాబు, జల్లి సత్యనారాయణ, జల్లి శ్రీను, మాజీ సర్పంచ్ దాసరి అప్పలస్వామి, హ్యాండీ క్రాఫ్ట్ కార్పొరేషన్ చైర్మన్ ఉండ్రు బేబీ ధనలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో కలసి ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వరూప్

ఫంక్షన్.. టెన్షన్

- శుభకార్యాలపై 'కోడ్' ఎఫెక్ట్
- సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంక్షలు
- ముమ్మరంగా పోలీసుల తనిఖీలు
- నగదు రూ.50 వేలు మించితే సీజ్
- ఆన్‌లైన్ చెల్లింపులకు అంగీకరించని వ్యాపారులు
- బంగారం, పెళ్లి దుస్తులు, ఇతర సామగ్రి కొనేందుకు తిప్పలు

కాకినాడ సిటీ: శుభకార్యాలపై ఎన్నికల కోడ్ ఎఫెక్ట్ పడింది. ప్రస్తుతం శుభ ఘడియలు నడుస్తున్నాయి. ఏప్రిల్ 26వ తేదీ వరకూ సుముహూర్తాలు ఉండటంతో అనేక మంది తమ పిల్లలకు సంబంధాలు కుదుర్చుకుని, వెంటనే పెళ్లిళ్లు కూడా చేస్తున్నారు. ఇందులో భాగంగా వధూవరుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున షాపింగ్ చేయడం, విందు భోజనాలకు అవసరమైన నిత్యావసరాల కొనుగోలుతో పాటు ఫంక్షన్ హాళ్ల బుకింగ్, పెళ్లి దుస్తులు, బంగారు ఆభరణాలు, ఫర్నిచర్, వంట సామగ్రి, వాహనాలు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడే వారికి అసలు చిక్కు వచ్చి పడుతోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమలులో ఉండటం, రూ.50 వేలకు మించి నగదు తీసుకుని వెళ్తే తనిఖీల్లో భాగంగా పోలీసులు వాటిని సీజ్ చేస్తూండటం వధూవరుల తల్లిదండ్రులకు ఇబ్బందిగా మారింది.

ఆన్‌లైన్ చెల్లింపులకు నిరాకరణ

ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆన్‌లైన్ చెల్లింపులపై ఐటీ ఆంక్షలు కొనసాగుతూండటంతో అత్యధిక శాతం వ్యాపారులు ఇప్పటికీ నగదు చెల్లింపులకే ఆసక్తి చూపుతున్నారు. ఆన్‌లైన్ చెల్లింపులపై సీఎస్‌టీ, జీఎస్‌టీలు ఉండటమే దీనికి కారణం. ముఖ్యంగా బంగారం ఆభరణాలు విక్రయించే వ్యాపారులు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు, కేటరింగ్ సంస్థలు, హోటళ్లు, వంట మనుషుల వంటి వారు చెక్కులు, ఆన్‌లైన్ నగదు చెల్లింపులను స్వీకరించడం లేదు. వీరందరూ ఐటీ భయంతోనే ఇలా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. దీంతో పెద్దపెద్ద వాటికే కాదు.. చిన్నచిన్న అవసరాలకు సైతం నగదు పైనే ఆధారపడాల్సి వస్తోంది. ప్రతి దానికీ పెళ్లి కార్డు, ఆన్‌లైన్ చెల్లింపులకు సంబంధించిన బిల్లులు వెంట తీసుకుని వెళ్లాల్సి వస్తోంది. అలా కాకుంటే పోలీసులు ఎక్కడ సీజ్ చేస్తారోననే భయం పెళ్లిబృందాల వారిని వెంటాడుతోంది.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆస్తులు తాకట్టు పెట్టినా పుట్టని అప్పు

ఇదిలా ఉండగా ఇళ్లల్లో శుభ కార్యాలకు పెద్ద ఎత్తున నగదు అవసరమవుతోంది. ఆశించిన స్థాయిలో ఇంట్లో నగదు లేకపోవడం, బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లపై ఆంక్షలు కొనసాగుతుండడంతో అవసరానికి స్థిరాస్తులు తాకట్టు (కుదువ) పెట్టినా మార్కెట్లో అప్పు పుట్టడం లేదు. అంతే కాదు.. బ్యాంకుల నుంచి రూ.10 లక్షలు మించి నగదు డ్రా చేస్తే వెంటనే ఐటీ అధికారులు రంగంలోకి దిగిపోతున్నారు. ఇది శుభకార్యాలు నిర్వహించుకుంటున్న వారిని మరింత ఆందోళనకు గురి చేస్తోంది. కేవలం వీరికే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు వెళ్లే రోగులకు సైతం ఎన్నికల ఆంక్షలు ఇబ్బందిగా మారాయి. అప్పు ఇచ్చి పుచ్చుకునే వారికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు.

ఆన్‌లైన్ అంటే కష్టమే

ప్రతి ఫంక్షన్ హాలులో 20 నుంచి 30 మంది వరకూ వర్కర్లు పని చేస్తూంటారు. వీరికి నగదు రూపంలోనే కూలీ చెల్లించాల్సి వస్తోంది. పూలు, పండ్లు, కూరగాయలు అమ్మే రైతులకు కూడా నగదు చెల్లించాల్సి వస్తోంది. అన్నింటికీ ఆన్‌లైన్ చెల్లింపులంటే ఐటీ నిబంధనలతో ఇబ్బంది పడాల్సి వస్తోందని ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు అంటున్నారు.

సరైన ఆధారాలుండాలి



ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉంది. నగదు, వస్తువులు, మద్యం తరలింపుపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించింది. శుభకార్యాల వేళ నగదు వెంట తీసుకుని వెళ్లే వారు ఇబ్బంది పడుతూంటారు. వీరు తమ వెంట పెళ్లి శుభలేఖలు, సదరు నగదు ఏ బ్యాంకు అకౌంట్ నుంచి డ్రా చేశారు? ఎంత డ్రా చేశారు? ఏం కొనుగోలు చేయబోతున్నారు? వంటి వాటికి ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. ఆస్పత్రులకు వెళ్లేవారు పేషెంట్ కేస్ షీట్‌లు వెంట తీసుకుని వెళ్లాలి. సాధ్యమైనంత వరకూ వెంట నగదు తీసుకుని వెళ్లకపోవడమే ఉత్తమం. ఏ ఆధారమూ లేని నగదును మాత్రమే జిల్లా గ్రీవెన్స్ కమిటీకి, ఐటీకి అప్పగిస్తారు. తనిఖీల్లో లభించిన నగదుకు సరైన ఆధారాలు చూపిస్తే వదిలేస్తారు.

– ఎస్.సతీష్‌కుమార్, జిల్లా ఎస్పీ, కాకినాడ

బీసీల పార్టీ అని చెప్పకుంటూ బలహీనుల పొట్ట కొడతారా?

- టీడీపీ నేతల కక్ష సాధింపు చర్యలపై ఖండ్రిగ సర్పంచ్ నవదీప ఆగ్రహం
- ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ అయిన తన భర్త సస్పెన్షన్‌పై ఆవేదన

కొత్తపేట: బీసీల పార్టీ అని చెప్పుకుంటూ మాలాంటి బలహీనులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడతారా? ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తన భర్త శ్రీనివాసరావును అన్యాయంగా సస్పెండ్ చేయిస్తారా అంటూ కొత్తపేట మండలం ఖండ్రిగ సర్పంచ్ దూనబోయిన నవదీప తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఖండ్రిగ ఎఫ్ఏ శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని టీడీపీ చేసిన ఫిర్యాదుపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆ శాఖ అధికారులు సస్పెండ్ చేశారు. దానిపై సర్పంచ్ నవదీప ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఖండ్రిగలో తన స్వగృహం వద్ద ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 24న తమ గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన దళితులు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారని, ఆ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అయిన తనను ఆహ్వానించగా తన భర్త శ్రీనివాసరావు తన మోటారు సైకిల్‌పై తీసుకువెళ్లి ఆ పక్కనే నిలబడ్డారన్నారు. దాంతో ఆయన పార్టీ కార్యక్రమంలో పాల్గొన్నట్టుగా టీడీపీ వారు ఫొటోలు, వీడియోలు తీసి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఆయనను సస్పెండ్ చేయడం వల్ల తాము ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ పదవి రిజర్వేషన్‌లో బీసీ మహిళకు కేటాయించగా సామాన్య కుటుంబానికి చెందిన తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని గుర్తు చేశారు. కుటుంబ పోషణకు తన భర్త ఎఫ్ఏగా పనిచేస్తున్నారని, అయితే టీడీపీ నాయకులు రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా పొట్ట కొట్టారంటూ నవదీప కన్నీటి పర్యంతమయ్యారు. దాంతో ఈ సమావేశంలో పాల్గొన్న పార్టీ మహిళా ప్రతినిధులు ఆమెను ఓదార్చారు. టీడీపీ కుయుక్తులపై మహిళా ప్రతినిధులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఆలమూరు మండలం మోదుకుర్రుకు చెందిన ఎఫ్ఏ నెల్లి రాజు అనే దళితుడిని సస్పెండ్ చేయించారని, ఇదేనా మీరు దళిత, బీసీలపై చూపించే ప్రేమ? అని టీడీపీ నేతలను ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ మహిళా ప్రతినిధులు ఏఎంసీ చైర్మన్ రెడ్డి రవీదేవి, మోదేకుర్రు సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు పితాని లక్ష్మీతులసి, బొక్కా నాగరాణి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మహిళా ప్రతినిధులు

స్పాట్‌కు సర్వం సిద్ధం

- ఒకటి నుంచి 8 వరకు టెన్త్ జవాబు పత్రాల మూల్యాంకనం
- జిల్లాకు 1.85 లక్షల సమాధాన పత్రాలు కేటాయించే అవకాశం
- ఏర్పాట్లలో అధికారుల నిమగ్నం



పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహించే అమలాపురం బాలుర ఉన్నత పాఠశాల

రాయవరం: పదవ తరగతి పరీక్షలు ముగిశాయి. జిల్లావ్యాప్తంగా ఈ నెల 18వ తేదీ నుంచి 112 పరీక్షా కేంద్రాల్లో పది పరీక్షలు ప్రారంభమైన విషయం విదితమే. 21,113 మంది విద్యార్థులు రెగ్యులర్, ప్రైవేట్‌గా పరీక్షలు రాయాల్సి ఉండగా, సరాసరిన 99.48 శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇప్పుడు అధికారులు జవాబు పత్రాల మూల్యాంకనంపై దృష్టి సారించారు. గత విద్యా సంవత్సరంలో జిల్లా కేంద్రమైన అమలాపురంలోని బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్పాట్ వేల్యుయేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. గతేడాది ఏప్రిల్ 19న ప్రారంభమైన స్పాట్ వేల్యుయేషన్ 26వ తేదీ వరకు ఆరు రోజుల పాటు నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే జవాబు పత్రాల మూల్యంకనాన్ని అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలతో పాటుగా, బాలికల ఉన్నత పాఠశాలలో కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి వచ్చిన పరీక్ష పేపర్ల కోడింగ్ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటలకు జవాబు పత్రాల మూల్యాంకనం చేపట్టనున్నారు.

దఫదఫాలుగా జవాబు పత్రాలు

ఈ ఏడాది వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1.85 లక్షల జవాబు పత్రాలను మూల్యాంకనం చేసే అవకాశముంది. మూల్యాంకన ప్రక్రియను సమర్థంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు తలమునకలయ్యారు. ఇప్పటికే పూర్తయిన పది పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాలు వివిధ జిల్లాల నుంచి దఫదఫాలుగా వస్తున్నాయి. ఇప్పటి వరకు తెలుగు, కాంపోజిట్ తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, పీఎస్ సబ్జెక్టులకు సంబంధించిన జవాబు పత్రాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. బయాలాజికల్ సైన్స్, సోషల్, ఒకేషనల్, ఓఎస్ఎస్ సబ్జెక్టులకు చెందిన జవాబు పత్రాలు రావాల్సి ఉంది. ఆయా జిల్లాలకు జిల్లా విద్యాశాఖ అధికారి క్యాంప్ ఆఫీసర్‌గా, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. వీరితోపాటు అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు జవాబు పత్రాల మూల్యాంకనంలో పాల్గొననున్నారు. గతేడాది 1,84,083 జవాబు పత్రాల మూల్యాంకనం చేపట్టారు. తెలుగు 25,168, కాంపోజిట్ తెలుగు-3,457, సంస్కృతం-2,163, హిందీ 29,058, ఇంగ్లిషు-24,209, గణితం-24,017, పీఎస్-24,781, బయాలజీ-24,781, సోషల్-26,307, వొకేషనల్ 142 పేపర్లను జిల్లాకు కేటాయించారు. ఈ ఏడాది కూడా అంతే స్థాయిలో జిల్లాకు కేటాయించే అవకాశముంది.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు	:	01
స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జి	:	01
అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు	:	07
ఏఏసీవోలు	:	07
చీఫ్ ఎగ్జామినర్లు	:	99
అసిస్టెంట్ ఎగ్జామినర్లు	:	594
స్పెషల్ అసిస్టెంట్లు	:	198

సబ్జెక్టుల వారీగా..

పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకన విధులకు ఆయా సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమిస్తూ ఇప్పటికే ఉత్తర్వులను సిద్ధం చేసే పనిలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఉంది. స్పాట్ వేల్యుయేషన్ ఉత్తర్వులను సంబంధిత ఉపాధ్యాయులకు ఒకటి రెండు రోజుల్లో అందజేయనున్నట్లు సమాచారం. ఏడు సబ్జెక్టులు, ఒకేషనల్ పరీక్షలు కలిపి మొత్తం ఎనిమిది రోజులు పాటు మూల్యాంకనం చేస్తారు.

నిబంధనలు..

మూల్యాంకన విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులు సెల్‌ఫోన్, స్మార్ట్‌ఫోన్లు, వైట్నర్, ఎరేజర్ తదితర వస్తువులను మూల్యాంకనం గదిలోకి తీసుకువెళ్లరాదు. ప్రతి రోజు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మూల్యాంకనం జరుగుతుంది. మూల్యాంకన సమయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎటువంటి తప్పిదాలు జరిగినా బాధ్యత వహించాల్సి ఉంటుంది. శిబిరానికి నిర్దేశిత సమయాల్లో హాజరు కాకుంటే, అటువంటి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు.

కోడింగ్ చేస్తున్నాం



ఇప్పటి వరకు జిల్లా కేంద్రానికి చేరుకున్న జవాబు పత్రాలను కోడింగ్ చేస్తున్నాం. రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం స్పాట్ వేల్యుయేషన్‌కు నియమ నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేస్తున్నాం.

– నక్కా సురేష్, అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షల విభాగం, అమలాపురం

అసౌకర్యం కలగకుండా..



ఇన్విజిలేటర్లకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నాం. జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. నిర్ణీత సమయంలో మూల్యాంకనం పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నాం.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

ఎవరికీ మినహాయింపులు ఉండవు



మూల్యాంకన విధులకు నియమితులైన వారు తప్పనిసరిగా విధులకు హాజరు కావాల్సి ఉంది. స్పాట్ వేల్యుయేషన్‌లో ఎవరికీ మినహాయింపులు ఉండవు. సకాలంలో మూల్యాంకనం జరిగేలా ఉపాధ్యాయులు సహకరించాలి.

– జి.నాగమణి, రీజనల్ జాయింట్ డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ.

క్లుప్తంగా

తాటాకిల్లు దగ్ధం.. రూ.4లక్షల ఆస్తి నష్టం



కాలిబూడిదైన తాటాకిల్లు

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు వాజ్‌పేయి కాలనీలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమై రూ.4లక్షల ఆస్తినష్టం సంభవించింది. గాడా నాగబాబుకు చెందిన తాటాకింటిలో గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు చెలరేగి ఒక్కసారిగా అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో నాగబాబు ఇంటిలో కుమార్తె వివాహానికని చీటీ పాడి తెచ్చుకున్న రూ.2.80 లక్షలు, 12 గ్రాముల బంగారం బూడిద పాలయ్యాయి. వీటితో పాటు గృహోపకరణాలు, రేషన్, ఆధార్ కార్డులు అగ్నికి ఆహుతయ్యాయి. అమలాపురం అగ్నిమాపక అధికారి కె.వి.కొండబాబు తన సిబ్బంది ఎల్ఎఫ్ వి.ప్రభాకరరావు, డీవోపీ వై.శ్రీనివాస్, జి.శ్రీను, ఎస్.లక్ష్మణ్ సాయంతో మంటలను ఆర్పివేశారు.

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు శశికళ



అమలాపురం రూరల్: ఇందుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థి ఉండుర్తి శశికళ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయింది. కాకినాడ వాకలపూడిలో జరిగిన ఎంపికల్లో 65 కేజీల పవర్ లిఫ్టింగ్ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచింది. ఈ నెల 30, 31వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ అండర్- 17 పోటీలకు విభాగానికి ఎంపికైనట్లు హెచ్‌ఎం విత్తనాల శ్రీనివాసరావు, పీఈటీ బుజ్జి తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన శశికళను సర్పంచ్ చొల్లంగి శివాని, ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

మండల పరిషత్ కార్యాలయంలో చోరీ

మానిటర్ దొంగిలించుకుపోయిన వైనం

గండేపల్లి: జాతీయ రహదారి, పోలీస్ స్టేషన్‌కు అతి సమీపంలో గల మండల పరిషత్ కార్యాలయంలో చోరీ సంఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు కార్యాలయం మెయిన్ ద్వారం తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించిన గుర్తుతెలియని చోరులు ఈఓఆర్డీ, రికార్డ్స్, ఎండీఓ, ఇతర గదుల తాళాలు పగులగొట్టి, గెడలు వంచి లోపలికి ప్రవేశించారు. అక్కడ ఏమి లేకపోవడంతో వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధించిన మానిటర్‌ను దొంగిలించుకుపోయినట్టు తెలిపారు. సోమవారం ఉదయం అటెండర్ విధులకు వచ్చేసరికి కార్యాలయం మెయిన్ డోర్ తాళాలు పగులగొట్టి ఉండటంతో ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. కార్యాలయం వద్దకు చేరుకున్న ఏఓ చంద్రరావు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు. చోరీకి గురైన మానిటర్ విలువ రూ.50,000 ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా అదే రోజు జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలోను గుర్తుతెలియని చోరులు కార్యాలయ తాళాలు పగులగొట్టారని, ఎటువంటి వస్తువులు చోరీకి గురికాలేదని తెలిసింది.

ఇళ్ల లూటీలో వీరు ఘటికులు

- ఇద్దరు అంతర్ జిల్లా చోరుల అరెస్ట్
- రూ.2.65 లక్షల విలువైన బంగారు నగల రికవరీ

అమలాపురం టౌన్: రాత్రి పూట ఇళ్లలో చోరీలు చేయడంలో వీరు సిద్ధహస్తులు. వారి కన్ను పడిందంటే చాలు ఇంట్లో బంగారు నగలు మాయం కావాల్సిందే. అంతర జిల్లాల దొంగల ముఠాలోని ఇద్దరి నిందితులను అమలాపురం పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2.65 లక్షల విలువైన 53 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆదేశాలతో అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు పర్యవేక్షణలో పట్టణ సీఐ కె.క్రిష్టోఫర్, సీసీఎస్ పోలీసులు ఈ ముఠాలోని ఇద్దరినీ పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసు వివరాలను పట్టణ సీఐ క్రిష్టోఫర్, పట్టణ ఎస్సై ఎస్ఆర్ కిషోర్‌బాబు గురువారం రాత్రి వివరించారు. పాలకొల్లుకు చెందిన తానింకి నరేష్, పాలకొల్లు మండలం లంకలకోడేరుకు చెందిన తమ్మినీడి షణ్ముక మణిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి నుంచి బంగారు నగలైన బ్రాస్ లెట్, నల్లపూసల లాకెట్, చెవిదుద్దులు, 5 ఉంగరాలు, బంగారు బిస్కెట్ ముక్క స్వాధీనం చేసుకున్నారు. అమలాపురం నల్లవంతెన దిగువన గల సాయిబాబా ఆలయం పక్క వీధిలో నివశిస్తున్న పేరాబత్తుల రాధాకృష్ణ ఇంట్లో గత సంవత్సరం సెప్టెంబర్ 8వ తేదీన చోరీ జరిగింది. అర్ధరాత్రి దాటాక దొంగలు ఇంటి తలుపులు పగులగొట్టి బంగారు నగలు కాజేశారు. ఇంటి యాజమాని రాధాకృష్ణ కుటుంబ సభ్యులు హైదరాబాద్ వెళ్లి తిరిగి వచ్చేలోపు దొంగలు ఇల్లును గుల్ల చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు అప్పటి పట్టణ సీఐ టి.క్రాంతికుమార్ కేసు నమోదు చేశారు. ఈ చోరీ కేసును ప్రస్తుత పట్టణ సీఐ క్రిష్టోఫర్, సీసీఎస్ సీఐ అబ్దుల్ సలామ్, పట్టణ ఎస్సై కిషోర్‌బాబు అధునాతన సాంకేతికతతో మరింత లోతుగా విచారించి నిందితులను గుర్తించారు. పాలకొల్లు ప్రాంతానికి చెందిన దొంగల ముఠా ముఖ్యంగా రాత్రి పూట ఇళ్లలో చోరీలకు తెగబడి బంగారు నగలు దోచుకున్న వైనంపై ప్రత్యేక దర్యాప్తు చేయగా ఆ ప్రాంతానికి చెందిన ఇద్దరి దొంగల పాత్ర కీలకంగా ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారు. నిందితులిద్దరినీ చాకచక్యంగా అరెస్ట్ చేసి వారి నుంచి బంగారు నగలు స్వాధీనం చేసుకున్న పట్టణ సీఐ, సీసీఎస్ సీఐ, పట్టణ ఎస్సై, సిబ్బందినిఎస్పీ శ్రీధర్, డీఎస్పీ మహేశ్వరరావు అభినందించారు.

'నన్నయ' విద్యార్థికి గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ సాధించిన పవన్‌కుమార్‌ని అభినందిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్ చాంపియన్ షిప్ 2023-24లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించాడని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్ కాలికట్‌లో గత నెల నిర్వహించిన ఈ పోటీలలో 95 కిలోల కేటగిరిలో యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో ఒకటైన కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థి కోడూరి పవన్‌కుమార్ ఈ ఘనతను సాధించాడన్నారు. ఇదే స్ఫూర్తితో మరెన్నో విజయాలు అందుకోవాలనే ఆకాంక్షను వెలిబుచ్చుతూ, గురువారం ఆ విద్యార్థిని అభినందించారు. యూనివర్సిటీ ద్వారా రూ.30 వేల బహుమతిని అందజేశారు. 2022లో ఛండీగఢ్ యూనివర్సిటీలో జరిగిన పోటీలలో బ్రాంజ్ మెడల్ అందుకున్నానని, ఈసారి గోల్డ్ మెడల్‌ని అందుకోవడం ఆనందంగా ఉందని పవన్ కుమార్ అన్నాడు. స్పోర్ట్సు కోటాలో రైల్వేలు ఉద్యోగం పొందాలనేదే తన లక్ష్యమని తెలిపాడు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి డాక్టర్ బి.రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

భార్య దాడితో భర్త మృతి

ఘర్షణలో కుమారుడికి గాయాలు



మృతుడు వెంకట్ (ఫైల్)



చికిత్స పొందుతున్న కృష్ణవంశీ

ఉండ్రాజవరం: భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణలో భర్త మృత్యువాత పడగా, కుమారుడు కత్తిపోటు గాయానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన మండల కేంద్రమైన ఉండ్రాజవరంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడెంకు చెందిన గుల్లంకి వెంకట్(44)కు, ఉండ్రాజవరం గ్రామానికి చెందిన పార్వతికి 20 ఏళ్ల క్రితం వివాహం కాగా, వారికి కొడుకు, కూతురు ఉన్నారు. అయితే పది ఏళ్లుగా భార్యాభర్తలు విడిగా ఉంటున్నారు. వెంకట్ తన స్వగ్రామం తాడేపల్లిగూడెంలో ఉంటుండగా, పార్వతి తన ఇద్దరూ పిల్లలతో ఉండ్రాజవరంలో జీవనం సాగిస్తున్నారు. వెంకట్ అప్పుడప్పుడూ వచ్చి పార్వతిని తనతో వచ్చేయమని గొడవ పడుతుండేవాడు. ఇటీవల కుమార్తె పెళ్లి కారణంగా వచ్చిన వెంకట్ పది రోజులు నుంచి ఉండ్రాజవరంలోనే ఉంటున్నాడు. బుధవారం రాత్రి పార్వతి తనతో వచ్చేయాలంటూ మళ్లీ గొడవకు దిగాడు. దాంతో భార్య పార్వతి, కొడుకు కృష్ణవంశీతో తీవ్ర ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో కృష్ణవంశీని వెంకట్ కత్తితో పొడిచాడు. కొడుకు కత్తిపోటుకు గురికావడంతో చలించిన పార్వతి ఒక్కసారిగా భర్తపై ఇటుకతో దాడికి పాల్పడింది. వెంకట్ దాడిని ప్రతిఘటించే క్రమంలో తల్లీ కొడుకు ఇద్దరూ కలసి ఇటుకలతో వెంకట్ తలపై కొట్టడంతో వెంకట్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే తేరుకున్న పార్వతి గాయపడిన భర్త, కొడుకును తణుకు ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా వెంకట్ పరిస్థితి విషమంగా ఉండటంతో తణుకు నుంచి ఏలూరు, అక్కడ నుంచి విజయవాడకు తరలించారు. గురువారం తెల్లవారుజామున వెంకట్ ఆసుపత్రిలో మృతి చెందాడు. కొడుకు కృష్ణవంశీ ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఉండ్రాజవరం ఎస్సై వి.అప్పలరాజు కేసు నమోదు చేయగా, నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరావు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఇప్పటి వరకు రూ.15 లక్షల సీజ్

గోకవరం: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ చెక్‌పోస్టుల ద్వారా రూ.15 లక్షల వరకు నగదును సీజ్ చేసినట్టు జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. గోకవరంలో రంపచోడవరం వెళ్లే మార్గంలోని చెక్‌పోస్టును గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల ద్వారా ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామన్నారు. రంపచోడవరం నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేసేందుకు అదనంగా చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజలు స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో ఓటు హక్కుని వినియోగించుకోవడానికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. ప్రజలు రూ.50 వేల వరకు వెంట తీసుకువెళ్లవచ్చన్నారు. అంతకుమించి నగదు పట్టుకెళ్లినప్పుడు సంబంధిత పత్రాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీ దృష్టికి తీసుకువెళితే 24 గంటల్లో విడుదల చేస్తామన్నారు. రూ.10 లక్షలకు మించి నగదు పట్టుకెళితే ఇన్‌కం ట్యాక్స్ అధికారులు పరిశీలించి విడుదల చేస్తారన్నారు.